సాక్షి
నంద్యాల

మంగళవారం | 21 | నవంబర్ | 2023



కేసీకి 1,930 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల నుంచి కేసీ కాల్వకు సోమవారం 1,930 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 1,430 క్యూసెక్కులు ఉండగా, డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



అన్నదాన పథకానికి విరాళం

మహానంది: మహానంది క్షేత్రంలోని నిత్యాన్నదాన పథకానికి నంద్యాల పట్టణానికి చెందిన ఎం. శ్రీనివాసరెడ్డి సోమవారం రూ. 1,01,16 విరాళంగా అందించారు.



గ్రంథాలయాల పాత్ర కీలకం

సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 8లో▸

న్యూస్‌రీల్

పంటల సాగుకు నెలాఖరు వరకు అనుకూలం

నంద్యాల(సెంట్రల్): రబీలో పంటలు సాగు చేసుకునేందుకు నవంబర్ నెలాఖరు వరకు అనుకూలంగా ఉందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న కారణంగా జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని సూచించారు. కేసీ, తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీకి నీటి విడుదల లేనందున వరి, మిరప తదితర అధిక పెట్టుబడి కూడిన పంటలు సాగు చేసి నష్టపోవద్దన్నారు. మెట్ట పంటలైన శనగ, మినుము, పొద్దుతిరుగుడు, కొర్ర, సజ్జలు, ఉలవలు, ఆవాలు అనువుగా ఉంటాయని పేర్కొన్నారు.

ఆశాజనకంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి మార్కెట్‌యార్డులో ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. సోమవారం యార్డుకు సూపర్-10 రకం సరకు అమ్మకానికి వచ్చింది. ఈ రకం జనరల్ గరిష్ఠ ధర క్వింటాలు రూ.22,500, మోడల్ ధర రూ.20,600, కనిష్ఠ ధర రూ.19,200గా నమోదైంది. ఇదే రకం తాలు కాయ క్వింటాలు గరిష్ఠ ధర రూ.11,300, మోడల్ ధర రూ.11,100, కనిష్ఠ ధర రూ.11,000 పలికిందని మార్కెట్‌యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులో ధ్రువీకృత వ్యాపారస్తుల వద్దే సరకు అమ్ముకుని మంచి ధరను పొందాలని సూచించారు.

3న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

కర్నూలు సిటీ: వచ్చే నెల 3వ తేదీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్‌ఎంఎంఎస్-జాతీయ ఉపకార వేతన)పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు డీఈఓ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లను www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

వైద్య యజ్ఞం.. ఆరోగ్య భాగ్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు విజయవంతం
- 45 రోజుల పాటు కొనసాగిన కార్యక్రమం
- ప్రతి ఇంటిని జల్లెడపట్టి అనారోగ్య సమస్యల గుర్తింపు
- జిల్లా వ్యాప్తంగా రూరల్‌లో 369, అర్బన్‌లో 88 శిబిరాల నిర్వహణ
- 2,33,330 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు
- అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం



నంద్యాల మండలం పెద్దకొట్టాల వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

సాక్షి, నంద్యాల: ఎంతో మంది పేదలు అనారోగ్య సమస్యలు ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, అవగాహన రాహిత్యంతో ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి. రోజూ వ్యవసాయం, ఇతర పనులకు వెళ్తే గాని పూట గడవని పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలను వారి దరికి చేర్చి ఆరోగ్య భాగ్యాన్ని కల్పించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు వెళ్లి చూపించుకోలేని నిస్సహాయులకు చేయూతనిస్తూ ఉన్న ఊర్లోనే వైద్యం అందేలా సెప్టెంబర్ 30వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు నంద్యాల జిల్లాలో విజయవంతమయ్యాయి. పల్లెలు, పట్టణాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. 45 రోజుల పాటు యజ్ఞంలా సాగిన కార్యక్రమాలు ఈనెల 19వ తేదీ ఆదివారంతో ముగిశాయి. ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సత్వర వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శిబిరాల నిర్వహణకు 15 రోజుల ముందుగా వలంటీర్లు ఈ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆఫీసర్లు ఇంటింటికీ తిరిగి ఎవరికి ఏఏ వ్యాధులు ఉన్నాయో గుర్తించి, వైద్యపరీక్షలు చేసి జాబితా తయారు చేశారు. ఈ జాబితా మేరకు ఆయా గ్రామాలు, వార్డుల పరిధిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు వారిని తరలించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు 457 శిబిరాలను నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 369, పట్టణ ప్రాంతాల్లో 88 శిబిరాలను ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలలో 2,33,330 మంది హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి రోగిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరమయ్యే మందులను ఉచితంగా అందజేయడంతో పాటు ఆస్పత్రుల్లో చికిత్స అవసరమైన వారిని నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

ప్రతి రోగికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య


దాదాపు 45 రోజుల పాటు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాలకు వచ్చిన ప్రతి రోగికి ప్రత్యేక ఐడీ కేటాయించి, వారి ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఏ వైద్యశిబిరం చూసినా సగటున 200 నుంచి 300 మంది చొప్పున హాజరై వైద్యపరీక్షలు, చికిత్సలు చేయించుకుని మందులు తీసుకెళ్లారు. ఇందుకోసం సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాల, మెడికల్ కళాశాలల నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమించారు. అవసరమైన వారికి ఏడు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతో పాటు 125 రకాల మందులను పంపిణీ చేశారు. సురక్ష మెగా ఆరోగ్య శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షల అనంతరం ఆస్పత్రుల్లో చికిత్స పొందేందుకు రెఫర్ చేసిన వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కంటి శుక్లాలు(క్యాటరేక్ట్) ఉన్న వారికి ఉచితంగా సర్జరీలు చేశారు. పీహెచ్‌సీల నుంచి బ్యాచ్‌ల వారీగా రోగులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. రెఫరల్ కేసులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు, ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. రెఫరల్ కేసులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

రెఫరల్ కేసులపై దృష్టి సారిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకున్నారు. లక్షలాది మంది ప్రజలు శిబిరాలకు హాజరై వైద్య సేవలు పొందారు. వీరందరికీ ఉచితంగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశాం. ఆదివారంతో శిబిరాలు ముగియడంతో ఇక రెఫరల్ కేసులపై దృష్టి సారించాం. వీటి పర్యవేక్షణ కోసం నోడల్ అధికారులను నియమించాం.

– జి. వెంకటరమణ, జిల్లా వైద్యాధికారి, నంద్యాల



చిత్రంలో వృద్ధుడి పేరు సుబ్బారావు. దొర్నిపాడు మండలం బుర్రా రెడ్డిపల్లె స్వగ్రామం. అతని వయసు 70 ఏళ్లు. కొన్నాళ్లుగా గుండెదడ ఉండటంతో ఆందోళన చెందుతూ ఉన్నాడు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చూయించుకోలేని పరిస్థితి. గుండెపోటు ఉండేమోనని భయపడ్డాడు. ఈ క్రమంలో ఆ ఊరిలోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద వైద్య పరీక్షలు చేస్తున్నారని తెలుసుకుని శిబిరానికి వెళ్లాడు. వైద్యులకు విషయం చెప్పడంతో అక్కడే ఈసీజీ పరీక్ష చేయించారు. అందులో అంతా నార్మల్‌గానే ఉందని చెప్పడంతో వృద్ధుడి మనసు తేలికపడింది. ఈలాంటి ఎంతో మంది పేదలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరంగా మారింద.

ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యార్థి పేరు మిద్దె సామేలు. నంద్యాల రూరల్ మండలం చాబోలు గ్రామం. ఐదేళ్లకే పోలియో సోకడంతో కాళ్లు, చేతులు చలనం లేకుండా పోయాయి. ప్రస్తుతం సామేలు చాబోలు జెడ్పీహెచ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కంటి చూపు మందగించడంతో వైద్య పరీక్షల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి తల్లి కృపమ్మతో కలిసి వెళ్లాడు. ఇతన్ని పరిశీలించిన వైద్యులు కళ్లలో శుక్లాలు ఉన్నాయని, జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని రెఫర్ చేశారు.



జగనన్న ఆరోగ్య సురక్ష వివరాలు

జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు	గ్రామీణ ప్రాంతాల్లో	పట్టణ ప్రాంతాల్లో
457	369	88

వైద్య సేవలు పొందిన వారు	మహిళలు	పురుషులు
2,33,330	1,02,085	1,31,245

ఆరోగ్య శ్రీకి రెఫర్ చేసిన కేసులు	కంటి ఆపరేషన్లకు రెఫర్ కేసులు
4,550	2,527

రక్తపోటు బాధితులు	షుగర్ బాధితులు	రక్తహీనత బాధితులు	డెంగీ టెస్టులు	మలేరియా టెస్టులు
10,150	8,125	3,709	2,527	5,097

మా ఊళ్లో 75 మందికి స్థలాలు వచ్చాయి



మా భర్త, నేను చాకలి వృత్తి చేసుకుంటూ బతుకుతున్నాం. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాది పెద్ద కుటుంబం కావడంతో గ్రామంలోనే చిన్న గదిని అద్దెకు తీసుకున్నాం. నెలకు అద్దె రూ. వెయ్యి. కుల వృత్తి చేసుకుంటూ బతికే మాకు స్థలం కొనుకునేంత స్తోమత లేదు. దాదాపు 13 ఏళ్లు అద్దె ఇళ్లలోనే కాలం వెళ్లదీస్తున్నాం. జగనన్న పుణ్యమా అంటూ ఇంటి స్థలం వచ్చింది. ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు కూడా ఇవ్వడంతో నిర్మాణం పూర్తి చేశాం. సొంతింటి కల నెరవేరింది. . నా పేరు మీద ఇప్పుడు రూ. 10 లక్షల ఆస్తి ఉన్నట్లే. మా ఊళ్లో 75 మందికి ఇంటి స్థలాలు వచ్చాయి. ఒక్కొక్కరికి సెంటున్నర. స్థలం విలువ రూ.5 లక్షలకు పైగా ఉంటుంది. జగనన్నను పేదలు ఎప్పటికీ మరిచిపోరు.



– చాకలి వెంకటమ్మ
యర్రగుంట్ల, శిరివెళ్ల మండలం

పేదల పాలిట దేవుడు జగన్



గతంలో పేదలకు పింఛన్ రావాలంటే బతికున్నట్లు సర్టిఫికెట్లు కావాలనే వారు. ఇంటి స్థలాలు, ఇళ్లు అనే మాటే లేదు. ఎన్నికల ముందు హడావుడి చేయడం, అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసేవారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అలాంటి పరిస్థితి లేదు. నాయకులు, అధికారుల చుట్టు తిరగాల్సిన పని లేదు. మేము చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మా సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. ఇల్లు మంజూరయ్యిందని అధికారులు చెప్పడంతో మా కుటుంబం ఎంతో సంతోషించింది. వెంటనే పనులు చేపట్టి పూర్తి చేసుకున్నాం. బిల్లులు కూడా సకాలంలో వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎంతో కృషి చేస్తున్నారు. పేదల పాలిట దేవుడిలా కనిపిస్తున్నారు.

– జూటూరు సుబ్బరాయుడు, రాజమ్మ, దంపతులు, సాధిక్‌నగర్, నంద్యాల

కృష్ణా జలాలను ఇంటింటికీ చేరుస్తాం

- మొదటి విడతగా సంక్రాంతికి బేతంచెర్లకు స్వచ్ఛమైన తాగునీరు
- ఫిబ్రవరి నెలాఖరుకు వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేస్తాం
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఇన్‌టెక్ వెల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, మేఘా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి

బేతంచెర్ల/పాణ్యం: 'ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలో ఇంటింటికీ కృష్ణా జలాలను పంపిణీ చేస్తాం. వాటర్ గ్రిడ్ పథకంలో భాగంగా ముందుగా సంక్రాంతి పండగలోపు బేతంచెర్ల మండలానికి స్వచ్ఛమైన నీరివ్వడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం' అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు శాశ్వత ప్రాతిపాదికన మంచినీరు అందించేందుకు రూ. 340 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులను సోమవారం మంత్రి బుగ్గన మెగా సంస్థ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై చర్చించారు. పాణ్యం మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్ దగ్గర ఉన్న ఇన్‌టెక్ వెల్ నిర్మాణాన్ని, బేతంచెర్ల మండలంలోని బుగ్గానిపల్లె తండా సమీపంలో 8 ఎకరాల్లో ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ సిబ్బంది, మెగా సంస్థ ప్రతినిధులతో మంత్రి బుగ్గన సమీక్ష సమావేశం నిర్వహించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగకు బేతంచెర్ల మండలానికి, ఫిబ్రవరి నాటికి డోన్, ప్యాపిలి మండలాలకు తాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్నారు. పైపులు, మ్యాన్ పవర్ కొరత దృష్టి సారించి మరింత వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకుగా వారం రోజులలోగా 600 మంది ప్రాజెక్టు మేనేజర్లు, ఇన్ చార్జులు, కో ఆర్డినేటర్లు, కార్మికులను నియమిస్తామని మెగా సంస్థ ఎండీ కృష్ణా రెడ్డి మంత్రి బుగ్గనకు వివరించారు. వాటర్ గ్రిడ్ పనులకు ఐదు పంపు హౌసులు, రైల్వే క్రాసింగ్‌లు, ఇటుక, విద్యుత్ పనులకు కావలసిన సమగ్ర వనరులను వారంలోగా అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. వారి వెంట జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, మెగా సంస్థ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ గోవర్ధన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ మనోహర్, డీఈ సోమశేఖర్, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తదితరులు ఉన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో టోకరా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ. 1.60 లక్ష తీసుకుని మోసం చేశాడని బాధితుడు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పందనకు జిల్లా ప్రజల నుంచి 90 ఫిర్యాదులు అందాయన్నారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపామన్నారు. స్పందన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. కార్యక్రమంలోఅడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీఐలు చంద్రబాబు, సూర్యమౌళి, దస్తగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో ఫిర్యాదులు కొన్ని....

- నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన రాజేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన మహేంద్ర బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 1.60 లక్షలు వసూలు చేశాడు. ఎన్ని రోజులైనా ఉద్యోగం రాకపోయేసరికి మహేంద్రను నిలదీశాడు. అయితే నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని రాజేష్ ఫిర్యాదు చేశారు.
- బిలకలగూడూరు గ్రామానికి చెందిన అబ్దుల్ అజీజ్‌కు చెందిన ఎకరా పొలాన్ని ఆయన కుమారుడు రఫి తన పేరుపై రిజిస్టర్ చేసుకున్నాడు. తండ్రికి తెలియకుండా వేరొకరికి విక్రయించి తండ్రిని ఇంటి నుంచి గెంటేశాడు. తనకు న్యాయం చేయాలని తండ్రి అబ్దుల్ అజీజ్ అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

కోటి కాంతుల కార్తీకం

- కార్తీక మొదటి సోమవారం భక్తులతో కిటకిటలాడిన శ్రీగిరి



శ్రీశైల ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవ శోభ



ఆలయం ఎదుట దీపారాధన చేస్తున్న భక్తులు



పాతాళగంగలో పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైలక్షేత్రం కార్తీక శోభితంగా మారింది. దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు వేకువజాము నుంచే శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు దీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర(శివ)మాఢవీధిలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన దీపారాధనలో పలువురు భక్తులు దీపాలు వెలిగించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహించిన లక్షదీపోత్సవం, పుష్కరిణిహారతి కనులపండువగా సాగింది. లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులు చేసి అర్చకులు, వేదపండితులు విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామిఅమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులను శాస్త్రోక్తంగా ఇచ్చారు. దశవిధ హారతుల్లో ఓంకార హారతి, నాగహారతి, త్రిశూలహారతి, నందిహారతి, సింహహారతి, సూర్యహారతి, చంద్రహారతి, కుంభహారతి, నక్షత్రహారతి, కర్పూరహారతిలను ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వీరన్నస్వామి, మార్కండేయశాస్త్రి ప్రత్యేక పూజాదికాలను నిర్వహించి హారతులిచ్చారు. భక్తులు హారతులను కన్నులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించి నేత్రానందభరితులయ్యారు. కళావేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందవరం విద్యుత్ ఏఈ సస్పెన్షన్

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించి, ఒకరి మృతికి కారణమైన విద్యుత్ సంస్థ నందవరం మండలం ఏఈ రవీంద్రను సస్పెండ్ చేస్తూ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నదికైరవాడి గ్రామంలో విరిగిపోయిన స్తంభం మార్చేందుకు సరైన ఎల్‌సీ తీసుకోకుండా ఈ నెల 15న పనులు చేయించేందుకు సిద్ధపడ్డారు. ఓ ప్రైవేటు వ్యక్తి నబి రసూల్ (సంస్థ ఉద్యోగి కాదు) చేత పనులు చేయిస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అతను అక్కడికక్కడే చనిపోయాడు. దీంతో సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, అసిస్టెంట్ లైన్‌మన్ రాఘవేంద్రరావులను విద్యుత్ అధికారుల సస్పెండ్ చేశారు. కాగా విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో ఏఈ రవీంద్రను సస్పెండ్ చేసినట్లు ఎస్ఈ ఉమాపతి తెలిపారు.

క్లుప్తంగా

డీసీఎంఎస్ సేవలను మరింత విస్తరిస్తాం



మహిళా కార్పొరేటర్లను సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ సేవలను మరింత విస్తరిస్తామని చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. ఈ నెల 14న మొదలైన 70వ అఖిల భారత సహకార వారోత్సవారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కర్నూలు నగరపాలక సంస్థకు చెందిన మహిళా కార్పొరేటర్లను డీసీఎంఎస్ చైర్‌పర్సన్ దంపతులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని మహిళా కార్పొరేటర్లను సత్కరించామన్నారు. నగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్పొరేటర్లు మరింత పట్టుదలతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు నిలోఫర్, హర్షియా పర్వీన్, షేక్ ఆలియా, విజయలక్ష్మి, చెన్నమ్మ, సుచరితమ్మ, కాశిరెడ్డి శ్వేత, మేరి, చిట్టెమ్మ, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా మహిళా క్రికెట్ జట్టుకు ప్రవల్లిక ఎంపిక



ఎమ్మిగనూరు టౌన్: అండర్–15 విభాగంలో ఆంధ్రా మహిళా క్రికెట్ జట్టుకు ఎమ్మిగనూరుకు చెందిన ప్రవల్లిక రెడ్డి ఎంపికైనట్లు కర్నూలు క్రికెట్ స్టేడియం కార్యదర్శి దేవేందర్ గౌడ్, కోచ్ అజ్మతుల్లాలు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి, హేమలత రెడ్డి దంపతుల కుమార్తె ప్రవళిక రెడ్డి. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆమెకున్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు క్రికెట్ వైపు ప్రోత్సహించారు. ఇప్పటివరకు 46 మ్యాచ్‌లు ఆడి 348 పరుగులు, 43 వికెట్లు సాధించి రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్‌లో ఉత్తమ బౌలర్‌గా ఎంపికయ్యారు. మంగళవారం బరోడాలో జరిగే బీసీసీఐ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు తరఫున ప్రవల్లిక రెడ్డి ఆడనున్నారు. దీంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శివోహం



గడివేముల: భోగేశ్వర ఆలయంలో..



శ్రీశైల క్షేత్రంలోని గంగాధర మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దశవిధ హారతులిస్తున్న శ్రీశైల అర్చకులు



శ్రీశైల ఆలయంలో భక్తులతో కిక్కిరిసిన క్యూ





కార్తీక మాసం మొదటి సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి ఆకాశ దీప దర్శనం చేసుకున్నారు. పలుచోట్ల వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. – సాక్షినెట్‌వర్క్



దేవనకొండ: శివలింగం రూపంలో దీపాలు



మహానందిలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



కర్నూలు: మణికంఠ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఆళ్లగడ్డ: పట్టణంలోని శివాలయంలో పోటెత్తిన భక్తులు



పాతాళగంగలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు



నందికొట్కూరు: కార్తీక వనభోజనంలో అయ్యప్ప స్వాములు

నీళ్లు తాగేందుకు వెళ్లి ఇద్దరు బాలురు మృత్యువాత

ఆదోని అర్బన్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఇద్దరు బాలురు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృత్యువాత పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పార్వతి, తుకారామ్ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు మంజునాథ్(09), అదే గ్రామానికి చెందిన అబ్బాస్‌ఆలీ కుమారుడు అక్బర్‌ఆలీ(10) ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలో ఒకరు నాలుగో తరగతి, మరొకరు ఐదో తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి హాజరు వేసుకొని పాస్(మూత్రం)కు వెళ్తామని బయటకు వచ్చారు. ఆ గ్రామంలో పాఠశాలకు కొంతదూరంలో ఉన్న ఎస్‌ఎస్ ట్యాంకు వద్దకు నీరు తాగేందుకు ఇద్దరూ వెళ్లారు. ట్యాంకులో ఒకరిచేయి ఒకరు పట్టుకొని దిగారు. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో ట్యాంకులో పడిపోయారు. కేకలు వేయడంతో అక్కడున్న ఒక బాలుడు చూసి స్థానికులకు తెలియజేశాడు. వెంటనే వారంతా ట్యాంకులోకి దిగి ఇద్దరు బాలురను బయటకు తీశారు. ముందుగా గ్రామంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోనికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఇద్దరూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే గ్రామస్తులు, బాలుర కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే తమ పిల్లలు మృతిచెందారని ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు జయమనోజ్‌రెడ్డి పరామర్శించారు.





మృతి చెందిన మంజునాథ్, అక్బర్‌ఆలీ (ఫైల్)

ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వీడాలి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

బనగానపల్లె రూరల్: ఓటరు జాబితా సవరణలో బూత్ స్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం బనగానపల్లెలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాలకు చెందిన తహసీల్దార్లు, బూత్‌స్థాయి అధికారులతో ఓటరు జాబితా సవరణపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు ముసాయిదా జాబితాను 2024 జనవరిలో విడుదల చేయడం జరుగుతుందని, బూత్ స్థాయి అధికారులు తమ వద్దకు వచ్చిన అన్ని రకాల ఫిర్యాదులు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. బూత్‌స్థాయి అధికారులు తమ వద్ద పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన క్లెయిమ్స్‌లన్నింటిని వెంటనే పరిష్కరించాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా బూత్‌లు వారీగా పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌పై రివ్యూ నిర్వహించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, ఈఆర్‌ఓ కామేశ్వరరావు, తహసీల్దార్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్‌బాబు, ఆల్‌ఫ్రెడ్, పుష్ప కుమారి, మల్లికార్జునరావు బూత్‌స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ

ఖనిజ అక్రమ రవాణాను అరికట్టాలి

కర్నూలు(న్యూటౌన్): ఖనిజ సంపద అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మైనింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బేతంచర్లలో మైనింగ్ చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది అటెండెన్స్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ఖనిజ అక్రమ రవాణాపై నిఘా పెంచాలన్నారు. అధికారులు, సిబ్బంది విధుల్లో అలసత్వం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పర్మిట్ లేకుండా అక్రమంగా ఖనిజ సంపదను తరలిస్తున్న వాహనాలను వదిలేస్తే వేటు వేయడం ఖాయమని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, బేతంచర్ల ఏడీ రాజగోపాల్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

- జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల తెలిపారు. ఈ నెల 21న నిర్వహించే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 50 ఏళ్ల నిండిన మత్స్యకారులకు పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ఇప్పటి వరకు 500 మంది మత్స్యకారులకు రూ.కోటి వరకు రుణాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. చేపల పెంపకం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏడు మత్స్యసాగు బడులు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఫిష్ ఆంధ్ర కింద 65 రిటైల్ అవుట్‌లెట్స్ ఏర్పాటు చేశామని, వీటి ద్వారా సముద్రపు చేపలు, రొయ్యలు, పీతలను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వెల్దుర్తిలో ఫిష్ సూపర్ రెస్టారెంటును ప్రారంభంతో పాటు కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకం



బహుమతులు అందుకున్న విజేతలతో కలెక్టర్ సృజన, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు కల్చరల్: సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. పాఠ్యాంశాలే కాకుండా వివిధ రకాల పుస్తకాలు చదివే అలవాటు అలవర్చుకోవాలన్నారు. అప్పుడు ప్రపంచంలో జరిగే విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. గ్రంథాలయ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రంథాలయ భవనం పక్కన ఉన్న భవనం శిథిలావస్థలో ఉందని, అందులో పందుల పెంపకంతో దుర్వాసన వస్తోందని, గ్రంథాలయనికి వచ్చే పాఠకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ భవనాన్ని అప్పగిస్తే గ్రంథాలయ సంస్థ నిధులతో అభివృద్ధి చేసుకుంటామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్, చైర్మన్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి పెద్దక్క, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ యూనస్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, బాషా, పద్మావతమ్మ, నసీమాబీ, చంద్రమ్మ, మద్దిలేటి, గోవిందరావు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు 'అల్కాలీస్' దెబ్బ

- ఫ్యాక్టరీ వ్యర్థాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం
- సమస్య పరిష్కరించాలని జేసీకి ప్రజల వినతి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): అల్కాలీస్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన వ్యర్థాలను తుంగభద్రలో విడుదల చేస్తున్నారని, దీంతో పంటలు పండటం లేదని కర్నూలు మండలం దేవమాడ, పూలతోట గ్రామాలకు చెందిన సత్యనారాయణ, వెంకటపతినాయుడు, కె.నారాయణరెడ్డి, చిదంబరయ్య, పి.వెంకటరాముడు తదితరులు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాలతో కూడిన నీటిని తాగిన పశువులు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జేసీతోపాటు డీఆర్వో కె.మధుసూదన రావు, ఎస్‌డీసీలు రమ, నాపప్రసన్నలక్ష్మీ, అనురాధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. అర్జీలకు సత్వరమే పరిష్కారాలు చూపాలని, పరిష్కరించిన వాటికి తప్పని సరిగా అర్జీదారుల నుంచి ఎండార్స్‌మెంట్ తీసుకోవాలని ఆమె సూచించారు. ఈనెల 22వ తేదీన శ్రీకాళహస్తిలోని ఏపీహెచ్‌ఆర్‌టీఐ శిక్షణ కేంద్రంలో స్పందనపై 30 శాఖలకు సంబంధించిన అధికారులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శిక్షణకు ప్రతి శాఖ నుంచి ఒకరు పాల్గొనేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని....

- తనకు 1.09 ఎకరాల పొలం ఉందని, దానిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని, వారి చెర నుంచి పొలాన్ని విముక్తి కలిగించాలని కర్నూలు మండలం నందనపల్లికి చెందిన మల్లెపోగు దేవమ్మ అర్జీ ఇచ్చారు.
- తాను 2017లో జి.నాగేశ్వరరెడ్డి నుంచి 2 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశానని, అయితే వారి వారసులు పొలాన్ని ఇవ్వాలని దౌర్జన్యం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండలం హెచ్. కైరవాడికి చెందిన బోయ నాగేశమ్మ కోరారు.

లక్కీ గోల్డ్ స్కీమ్ పేరుతో మోసం

- ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- పోలీస్ స్పందనకు 108 ఫిర్యాదులు

కర్నూలు: లక్కీ గోల్డ్ స్కీమ్ పేరుతో నెలకు రూ.1,500 ప్రకారం మొత్తం 20 నెలలు కట్టించుకుని బంగారు, వెండి లేదా బహుమతులు ఇస్తామని చెప్పి కర్నూలు పాతబస్టాండ్ దగ్గర ఉన్న జీఏఆర్ జ్యువెలర్స్ వారు మోసం చేశారని, ఐదు నెలల నుంచి ఫోన్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని కర్నూలుకు చెందిన ఏసురత్నం అడ్మిన్ అడిషనల్ ఎస్పీ సర్కార్‌కు ఫిర్యాదు చేశారు. కొత్తపేటలోని కర్నూలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 108 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ నాగభూషణం, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న అడిషనల్ ఎస్పీ సర్కార్

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో గద్వాల బస్సు ఎక్కేటప్పుడు తన మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని, తన బ్యాంకు ఖాతా నుంచి వేరే నంబర్‌కు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించారని, విచారణ జరిపి తగు న్యాయం చేయాలని కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన ఆనంద్ కుమార్ కోరారు.
- భర్త నాగరాజు మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా తనను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని దేవనకొండకు చెందిన వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- పెంచికలపాడుకు చెందిన మియా అనే దళారి తన దగ్గర 28 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి 19 క్వింటాళ్లే ఉన్నాయని అబద్ధం చెబుతూ మోసం చేస్తున్నాడని, తగిన చర్యలు తీసుకోవాలని గూడూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన సత్యనారాయణ కోరారు.

ప్రేమ పేరుతో ఆర్మీ ఉద్యోగి మోసం

- న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట యువతి దీక్ష

డోన్ టౌన్: ప్రేమ పేరుతో ఆర్మీ ఉద్యోగి తనను మోసం చేశాడని ఓ యువతి సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టింది. బాధితురాలు చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన శిరీష మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ప్రవీణ్ ఆరేళ్ల క్రితం ప్రేమ పేరుతో తన వెంట పడ్డాడన్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడన్నారు. ఇప్పుడు మరో యువతితో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరారు. కాగా యువతికి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ, ఉపాధ్యక్షురాలు షమీమ్‌బేగం గ్రామ మహిళలు మద్దతు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న దృశ్యం